క్లుప్తంగా

రేపు మున్సిపల్ సాధారణ సమావేశం

రేపల్లె రూరల్: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఈ నెల 28వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా ఆదిత్య ఇంగ్లిష్ మీడియం స్కూల్ వార్షికోత్సవం



చెరుకుపల్లి: విద్యార్థులు విద్యతో పాటు వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో కూడా రాణించాలని అందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలని నగరం ఎస్‌వీఆర్‌ఎం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనగాని శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని కావూరు ఆదిత్య ఇంగ్లిష్ మీడియం స్కూల్ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆదిత్య ఇంగ్లిష్ మీడియం స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ కోడే కృష్ణబాబు, పూషడపు వెంకట నారాయణ, కోడే తేజస్వి, దొంతిరెడ్డి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

తహసీల్దారు సుశీల



వేమూరు: ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తహసీల్దారు సుశీల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్ర 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని ఆమె చెప్పారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఎన్నికల సిబ్బందిని కేటాయించడం జరిగిందని ఆమె తెలియజేశారు. నియోజకవర్గంలో పట్టభద్రులు ఓట్లు 8,640 ఉన్నాయని తెలిపారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించేందుకు ప్రత్యేక అధికారులను కేటాయించడం జరిగిందని ఆమె చెప్పారు.

ఈవూరు సీతారావమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం



చెరుకుపల్లి: మహా శివరాత్రి రోజున పరమ శివుణ్ని దర్శించి పూజించటం ద్వారా ఆయా కుటుంబాలు సుఖశాంతులతో వర్ధిల్లుతాయని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. మండలంలోని గుళ్ళపల్లి గ్రామంలో ఈవూరు సుబ్బారావు మెమోరియల్ మెడికల్ హెల్త్ కేర్ ఎడ్యుకేషన్ సొసైటీ, ఈవూరు సీతారావమ్మ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మహా శివరాత్రిని పురస్కరించుకొని భక్తులకు బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ఈ రెండు స్వచ్ఛంద సంస్థల ద్వారా 2019 నుంచి అనేక సేవా కార్యక్రమాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలను ఆదుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యురాలు డాక్టర్ కేశవతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుండి వెంకట రామిరెడ్డి, ఉయ్యూరు శాంతి రాజు, కృష్ణారెడ్డి, నడింపల్లి గ్రామ సర్పంచ్ ఏమినేని సుబ్బారావు, గాలిమోటు రాజశేఖర్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను ఉపయోగించుకోండి

తెనాలిఅర్బన్: ప్రయాణికులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు తీసుకువెళ్ళేది ఆర్టీసీ బస్సులని, అందరు వాటిలో ప్రయాణించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని తెనాలి డిపో నుంచి గోవాడ, క్వారీలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు సర్వీస్‌లను బుధవారం తెల్లవారుజామున ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ మాట్లాడుతూ తెనాలి డిపో నుంచి క్వారీకి 30, గోవాడకు 30, శ్రీశైలంకు 8, చెరుకుపల్లి, గోవాడకు అదనంగా మరో 2 బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్సులు బుధవారం తెల్లవారుజాము నుంచి గురువారం ప్రయాణికుల రద్దీ తగ్గే వరకు తిరుగుతాయని చెప్పారు. సాధారణ చార్జీలతోనే నడుపుతున్నట్లు వివరించారు. ప్రయాణికులు ఈ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం



ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీవో నేలపు రామలక్ష్మి



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న ఏఎస్పీ విఠలేశ్వర్

- నేడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు
- రేపల్లె డివిజన్‌లో 17,862 మంది ఓటర్లు

రేపల్లె రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేందుకు రేపల్లె డివిజన్‌లో సర్వం సిద్ధమైంది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రేపల్లె డివిజన్‌లోని రేపల్లె, వేమూరు నియోజకవర్గాలలో 23 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో 17,862 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో 10,930 మంది పురుషులుకాగా, 6,928 మంది మహిళలు, నలుగురు ఇతరులు ఉన్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల వద్ద పట్టభద్రులు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయటంతో పాటు సర్వం సిద్ధం చేశారు. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

డివిజన్‌లో 23 పోలింగ్ కేంద్రాలు

ఎన్నికలలో భాగంగా రేపల్లె డివిజన్‌లో 23 పోలింగ్ కేంద్రాలు ఉండగా రేపల్లె నియోజకవర్గంలో 13, వేమూరు నియోజకవర్గంలో 10 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. రేపల్లె పట్టణంలోని ప్రకాశం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో 5 పోలింగ్ కేంద్రాలు, రేపల్లె మండలంలోని పిరాట్లంక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1, నిజాంపట్నం మండలం అడవులదీవి ప్రాథమిక పాఠశాలలో 1, కస్తూరిపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1, నగరం మండలంలోని ఎస్వీఆర్‌ఎం కళాశాలలో 2, చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లి జిల్లా పరిషత్ హైస్కూలులో 3, వేమూరు నియోజకవర్గం చుండూరు మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూలులో 2, అమర్తలూరు జిల్లా పరిషత్ హైస్కూలులో 2, వేమూరు ప్రభుత్వ పాఠశాలలో 2, కొల్లూరు జిల్లా పరిషత్ హైస్కూలులో 2, భట్టిప్రోలులోని టీఎంరావు హైస్కూలులో 2 చొప్పున పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.



ప్రకాశం స్కూలులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం



ఎన్నికలకు సిద్ధంగా ఉంచిన బ్యాలెట్ బాక్స్‌లు

ఆయా పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ అధికారులు, అదనపు పోలింగ్ అధికారులు, రూట్ అధికారులు, సెక్టారు అధికారులను ఇప్పటికే నియమించి విధులు కేటాయింపు చేశారు. అదనపు సిబ్బందితో కలిపి 122 మంది ఎన్నికల విధులలో పాల్గొననున్నారు. 23 పోలింగ్ కేంద్రాలను 4 సెక్టారులు, 4 రూట్‌లుగా విభజించి మైక్రో అబ్జర్వర్‌ల పర్యవేక్షణలో పోలింగ్ సరళిని పర్యవేక్షించనున్నారు. బుధవారం పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆర్డీవో నేలపు రామలక్ష్మి ఎన్నికల విధులలో పాల్గొననున్న సిబ్బందికి ఎన్నికల సామగ్రిని అందజేయటంతో పాటు పోలింగ్ రోజు పాటించాల్సిన విధులను వివరించారు.

137 మందితో పటిష్ట బందోబస్తు

ఎన్నికల విధులకు పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఏఎస్పీ విఠలేశ్వర్ ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నికల విధుల్లో తీసుకోవాల్సిన విధానాలను వివరించారు. అనంతరం ఏఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ డివిజన్‌లోని 23 పోలింగ్ బూత్‌ల వద్ద 137 మంది సిబ్బందితో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల విధుల్లో డీఎస్పీతో పాటు నలుగురు సీఐలు, ఏడుగురు ఎస్‌ఐలు, ఏడుగురు ఏఎస్‌ఐలు, 30 మంది హెడ్‌కానిస్టేబుల్స్, 43 మంది కానిస్టేబుల్స్, 28 మంది మహిళా పోలీసులు, 17 మంది హోమ్‌గార్డులను నియమించామన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటింగ్ కేంద్రాల వద్ద ప్రశాంత వాతావరణంలో ఓటు వేసే విధంగా, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పట్టభద్రులు పోలీసులకు సహకరించాలని కోరారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించటం జరుగుతుందని, 200 మీటర్ల లోపు గుంపులుగా ఉండరాదని పేర్కొన్నారు. ఆయా పార్టీలకు సంబంధించి గుర్తులు ప్రదర్శించరాదన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫీజు పోరు నిరసన కార్యక్రమాన్ని

విజయవంతం చేయాలి

డాక్టర్ ఈవూరు గణేష్



చెరుకుపల్లి: పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదును ప్రభుత్వం సకాలంలో అందించకపోవటంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారని రేపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ ఆవేదన వ్యక్తం చేశారు. గుళ్ళపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ గణేష్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రతి పేద విద్యార్థి చదువు బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని, ఎంతటి ఉన్నత చదువు అయినా ఫీజులు ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రచారం చేసుకొని తీరా అధికారం వచ్చిన తరువాత పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. పరీక్షలు సమీపిస్తున్న సమయంలో కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లిస్తేనే హాల్‌టికెట్‌లు ఇస్తామని బెదిరిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. దీనికోసం వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు మార్చి12న ఫీజు పోరు నిరసన కార్యక్రమం బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహిస్తామని తెలిపారు. అదే విధంగా నియోజకవర్గంలో మార్చి చివరి వారంలో పల్లె పడక కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పార్టీ అధిష్టానానికి తెలియపరచి వాటిని పరిష్కరించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని అన్నారు. అందులో భాగంగా మొట్టమొదటిగా మండలంలోని ఆళ్ళవారిపాలెం పంచాయతీ బాప్టిస్టుపాలెంలో పల్లె పడక కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. ఫీజు పోరు కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ దుండి వెంకట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోవాడకు పోటెత్తిన భక్తులు



గోవాడ బాల కోటేశ్వరస్వామి దేవస్థానంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్



గోవాడ బాల కోటేశ్వరస్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

అమర్తలూరు(వేమూరు): మహా శివరాత్రి తిరునాళ్లకు గోవాడ బాల కోటేశ్వర స్వామి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. అమర్తలూరు మండలంలోని గోవాడ గ్రామంలో వేంచేసి ఉన్న బాల కోటేశ్వరస్వామి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు ప్రభలతో ఆలయానికి తరలివచ్చారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, నియోజకవర్గ శాసన సభ్యులు నక్కా ఆనందబాబు బాల కోటేశ్వర స్వామిని బుధవారం దర్శించుకున్నారు. దేవస్థానంలో భక్తులకు ఉచిత అన్నదానం చేపట్టారు.

శంభో.. శంకర

- శివ నామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



ఆలయంలో బారులుతీరిన భక్తులు



అగ్రహారంలోని రామలింగేశ్వరస్వామి



ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి




చోడాయపాలెంలోని చౌడేశ్వరస్వామి



కోటిపల్లి సోమశేఖరాలయంలో అమ్మవారు



బోలాయపాలెంలోని కాశీ విశ్వేశ్వరస్వామి



కోటిపల్లి సోమశేఖరాలయంలో స్వామి వారు

బాపట్ల: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణ, మండలంలోని శైవ క్షేత్రాలు భక్తులతో కిక్కిరిశాయి. సూర్యోదయానికి ముందే భక్తులు శైవ క్షేత్రాలకు చేరుకొని ప్రత్యేక పూజల్లో నిమగ్నమయ్యారు. భక్తులు శైవక్షేత్రాలకు బుధవారం భారీగా పోటెత్తారు. శైవక్షేత్రాల్లో శివ నామస్మరణ మారుమోగింది. పట్టణంలోని సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రసాద్ గురుస్వామి శివరాత్రి మహిమలను భక్తులకు వివరించారు. మూడు స్థితులకు కారణమైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు ఒకే స్థానం శివలింగం అన్నారు. శివలింగంలో మొదటి భాగం బ్రహ్మరూపం, మధ్య భాగం విష్ణురూపం, పై భాగం శివరూపం అని అందువల్లనే శివలింగాన్ని త్రిమూర్తి స్వరూపం అంటారని వివరించారు. శివలింగార్చన వలన సర్వపాపాలు హరించబడతాయన్నారు. అనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. పట్టణంలోని ఎస్ఎన్‌పీ అగ్రహారంలోని గంగా పర్వత వర్ధనీ సమేత రామలింగేశ్వరస్వామి, వెదుళ్ళపల్లిలోని రామలింగేశ్వరస్వామి, భర్తిపూడి గ్రామాల్లోని శైవక్షేత్రాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొని పూజలు నిర్వహించారు.

రేపల్లెలో...

రేపల్లె రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని రేపల్లె పట్టణ, మండలంలోని పలు శైవక్షేత్రాలలో వేడుకలను వైభవంగా బుధవారం నిర్వహించారు. స్వామి వార్లకు ఉదయం నుంచే అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. రేపల్లె పట్టణం ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి ఆలయం, ఓల్డ్‌టౌన్‌లో ఉమామహేశ్వరస్వామి ఆలయం, రైలుపేటలోని స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయం, చోడాయపాలెంలోని చౌడేశ్వరస్వామి ఆలయం, కారుమూరులోని అమరలింగేశ్వరస్వామి ఆలయం, మోర్తోటలోని ముక్తేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వార్లను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయాల కమిటీల సభ్యులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కొల్లూరులో...

కొల్లూరు : శివరాత్రి పర్వదినాన్ని మండలంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో శైవక్షేత్రాలకు తరలివెళ్లి దైవ దర్శనం చేసుకున్నారు. మండలంలోని కోటిపల్లి సోమశేఖరాలయంలో శివరాత్రి పూజలు అత్యంత ఘనంగా జరిగాయి. చుట్టుపక్కల మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని ప్రత్యేక అలంకారంలో దేవతామూర్తులు భక్తులకు దర్శనమిచ్చారు. కొల్లూరు అనంతభోగేశ్వర స్వామి, పెసర్లంక, అనంతవరం, క్రాప, చింతర్లంక, చిలుమూరు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం: మహాశివరాత్రి వేడుకలు మండలంలో బుధవారం వైభవంగా జరిగాయి. కర్లపాలెం బదరీ కేదారేశ్వరస్వామి ఆలయంలో శివస్వాములు స్వామి వారి తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా గంగా, గౌరీ సమేత కేదారేశ్వర స్వామి వారికి మహా రుద్రాభిషేకం, అర్చనలు, అభిషేకాలు, పుష్పార్చన చేశారు. శివస్వాములు బ్రహ్మ, విష్ణు మహేశ్వరుల చిత్ర పటాలకు విశేష పూజలు నిర్వహించి శివస్వాములకు చద్ది పంపిణీ చేశారు. కొత్త నందాయపాలెంలోని దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో శాంతి హోమాలు నిర్వహించారు. బోలాయపాలెంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి, పేరలిలోని బాలా త్రిపురసుందరీ సమేత సోమేశ్వరస్వామి, పెదగొల్లపాలెం అమరలింగేశ్వర స్వామి, బోలాయపాలెంలోని కాశీ విశ్వేశ్వరాలయంలో భక్తులు స్వామి వారికి అభిషేకాలు చేశారు. అలాగే శ్రీధర్మ శాస్త్ర స్వామి అయ్యప్ప ఆలయంలోని శివలింగానికి, ఇందిరానగర్ గ్రామంలోని ఆదిశేషుని ఆలయం, ఎంవీరాజుపాలెంలోని కోదండరామ స్వామి ఆలయం, నల్లమోతువారిపాలెంలోని లలితా త్రిపుర సుందరీ ఆలయాల్లో అభిషేకాలు అర్చనలు, విశేష పూజలు జరిగాయి. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. యాజలి, గణపవరం కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో అభిషేకాలు చేశారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పిట్టలవానిపాలెంలో..

మండల పరిధిలోని చందోలు గ్రామంలో వేంచేసియున్న లింగోద్భవ స్వామి ఆలయం, మంతెనవారిపాలెం, ఖాజీపాలెం గ్రామాలలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అభిషేకాలు, అర్చనలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

చెరుకుపల్లిలో...

చెరుకుపల్లి: మహాశివరాత్రి పర్వదినాన్ని భక్తులు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు శైవక్షేత్రాల్లో పూజలు, అభిషేకాలు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రముఖ శివాలయాలను ప్రత్యేకంగా రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గోవాడ గ్రామంలో వేంచేసియున్న బాల కోటేశ్వరస్వామి ఆలయానికి మండలం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ప్రభలను అలంకరించి ఊరేగింపుగా హర హర.. అంటూ బాలకోటేశ్వరస్వామి గుడికి తరలివెళ్లారు.



కేదారేశ్వరస్వామిని దర్శించుకున్న సీఐ, ఎస్ఐ



ప్రభతో గోవాడ వెళుతున్న గుళ్ళపల్లి భక్తులు

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు



నగరంలోని అయ్యప్ప దేవస్థానంలో మహాసంప్రోక్షణలో భక్తులు

నగరం: మహాశివరాత్రి పర్వదినాన్ని మండలంలోని ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలు బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని ఈదుపల్లి శివాలయంలో ఆలయ ధర్మకర్త శేషగిరిరావు పర్యవేక్షణలో అభిషేకాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అదే విధంగా ధూళిపూడి, తోటపల్లి, నగరం, పెదపల్లి గ్రామాలలోని శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అయ్యప్పస్వామి ఆలయంలో...

మహాశివరాత్రిని పురస్కరించుకుని నగరంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలోని విఘ్నేశ్వరుడు, అయ్యప్ప, సుబ్రమణ్యస్వామి పంచలోహ విగ్రహాలకు మహాసంప్రోక్షణ కార్యక్రమాన్ని కనులపండువగా జరిపించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త పద్యాల రామకోటేశ్వరరావు పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

గోవాడ, అరవపల్లి తరలివెళ్లిన భక్తులు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని భక్తులు ప్రసిద్ధ శైవక్షేత్రాలైన గోవాడ, అరవపల్లి, మోర్తోటలకు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. చిన్నారులు చిన్న ప్రభలను కట్టి వాటిని గోవాడకు తరలించారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడంతో భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా పుణ్యక్షేత్రాలకు వెళ్లారు. మరికొంత మంది భక్తులు ట్రాక్టర్లు, ఎడ్లబళ్లపై తరలి వెళ్లారు.

ఆకట్టుకున్న ప్రభలు





మహాశివరాత్రిని పురస్కరించుకుని అరవపల్లిలోని బాలకోటేశ్వరస్వామి తిరునాళ్లకు పరిసర ప్రాంతాలు, గ్రామాల నుంచి తరలివెళ్లిన ప్రభలు ఆకట్టుకున్నాయి. వివిధ గ్రామాల నుంచి భక్తులు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ప్రభలను ఊరేగింపుగా అరవపల్లికి బుధవారం తరలించారు. – రేపల్లె రూరల్

